# అనుభవం

జీవితం అనుభవాల సమాహారం. వాటిలో చేదు అనుభవాలు కొన్నైతే మరువలేనివీ మధురమైనవీ మరికొన్ని. గతంనుంచే మనిషి పాఠాలు నేర్చుకుని భావిజీవితాన్ని చక్కదిద్దుకుంటాడు. తొందరపడి తీసుకునే తప్పుడు నిర్ణయాల వల్ల మనిషి కోలుకోలేని దెబ్బతినే ప్రమాదముంది. ఆ తర్వాత సవరించుకుందామన్నా వీలుపడదు. ఆ స్థితి కలగకూడదనుకుంటే ఇతరుల అనుభవాలను సైతం పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. . . ఇలా సాగుతున్నాయి ఆదిలక్ష్మి ఆలోచనలు.

భర్త పోయి పుట్టెడు దుఃఖంలో ఉందామె. పరామర్శించేందుకు వచ్చిన వాళ్ళంతా దాదాపుగా వెళ్ళి పోయారు. అయినవాళ్ళూ ఆత్మీయులూ నేడో రేపో పెట్టె సర్దుకోడానికి సిద్ధంగా ఉన్నారు. ఎవరు మాత్రం ఎన్నాళ్ళని ఉండిపోతారు? ఇన్నాళ్ళూ భర్త ఉండటం, చిన్నదో పెద్దదో ఆయన ఓ ఉద్యోగం చేస్తుండటం వల్ల ఆర్థిక ఇబ్బందులు తెలియలేదు ఇకపై కొడుకునూ కూతుర్నీ తనొక్కర్తే చూసుకోవాలి. వాళ్ళకి కావలసినవన్నీ తనే అమర్చిపెట్టాలి ఏ ఆధారంలేని తను వాళ్ళకేం చేయగలదు? భర్తది ప్రైవేట్ ఉద్యోగం కావడం వల్ల పింఛను సదుపాయం లేదు. గుడ్డిలో మెల్ల చందంగా మేనేజ్‌మెంట్‌వారు దయదలచి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తామన్నారు. అదే తనకు కొండంత ఊరటనిచ్చింది.

ఉద్యోగంలో చేరేందుకు సిద్ధపడింది ఆదిలక్ష్మి.

“నువ్వెందుకమ్మా ఉద్యోగానికెళ్ళడం? నేనున్నాను కదా! ఆ పనేదో నేను చేసి మిమ్మల్ని పోషిస్తాను” భరోసా ఇచ్చాడు కిషోర్.

“అబ్బాయి అన్నది సబబుగానే ఉంది. ఈ వయసులో నువ్వెళ్ళి ఏం పనిచేస్తావ్?

ఆ ఉద్యోగమేదో వాడిని చేసుకోనీ'' వత్తాసు పలికాడు తన అన్న.



నిజమే, పిల్లవాడు డిగ్రీ చదివాడు కాబట్టి, వాడి కైతే కాస్త మెరుగైన ఉద్యోగం దొరుకు తుంది. పదోతరగతి అయినా పూర్తిచేయని తనకేమిస్తారు... బంట్రోతు పని తప్ప - అనుకుంది ఆదిలక్ష్మి.

అయితే ఆమె నోటి నుండి ఏ మాటా రావడం లేదు. ఏ నిర్ణయం వెలువడటం లేదు.

"కిషోర్ ఉద్యోగంలో చేరితే ముప్పై అయిదేళ్ళు సర్వీసు చేయవచ్చు. నువ్వెళితే ఏం లాభం వదినా? పట్టుమని పదేళ్ళు పూర్తిచేయకుండానే రిటైరైపోవాలి'' ఆలోచించమన్నట్టుగా చూశాడు మరిది.

గత వారం రోజులై ఇదే విషయం ఆ ఇంట్లో నలుగుతోంది. తెల్లవారేలోగా తన నిర్ణయం తెలియజేయాలి. ఇప్పటికే వారిచ్చిన గడువు పూర్తి అవుతోంది. ఇంకా తాత్సారం చేస్తే కంపెనీవారు కనపరిచే సాను భూతి కనుమరుగయ్యే ప్రమాదముంది. త్వరగా వాళ్ళకేదో ఒక ముక్క చెప్పాలి. అంతా కొడుకునే సపోర్టు చేస్తున్నారు. వాళ్ళంతా అంటున్నట్లు అబ్బాయి ఉద్యోగంలోకెళ్లడమే బావుంటుందేమో!

అంతలోనే కళ్ళముందు దీనంగా కనిపించింది కళ్యాణి. ఆరేళ్ళ క్రితం తను విజయవాడలో ఉండేటప్పుడు ఆమె పొరుగున ఉండేది. ఎంతో కలుపుగోరు మనిషి. చాలా మంచిది. అతి తక్కువ కాలంలోనే ఆమెకు తన కుటుంబంతో సన్నిహిత సంబంధ మేర్పడిపోయింది. అనుకోకుండా భర్తకు ట్రాన్స్‌ఫర్ అవడంతో ఆ బంధం ఎక్కువకాలం నిలువలేదు.

మొన్నీమధ్య తెలిసిన వాళ్ళ పెళ్ళికెళ్ళినప్పుడు ఆమెను వంటమనిషిగా చూడటం తటస్థించి మనసు కలుక్కుమంది. ప్రభుత్వోద్యోగైన భర్తా. . . పిల్లలతో ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉండే కళ్యాణి ఇక్కడ వంట చేయడమేంటి? ఏమైందీ మెకు? అనుకుంటూ దగ్గర కెళ్ళి పలకరించేసరికి కళ్ళ నీరు నింపుకుంది అడగ్గా అడగ్గా ఆమె చెప్పిన మాటలింకా చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

★ ★ ★

గుండెపోటుతో ప్రాణాలొదిలాడు గురునాథం. హఠాత్తుగా భర్త పోవడంతో హతాశురాలైంది కళ్యాణి గుండెలవిసేలా విలపించింది.

ఆమెకు ముగ్గురు సంతానం. ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు. భర్త గవర్నమెంటు ఉద్యోగి అవడం వల్ల, ఆ కుటుంబం వీధినపడిపోలేదు. అతని సర్వీసు తక్కువ కావటంతో ఆమెకు నామమాత్రపు పెన్షను మంజూరైంది. డిసీజ్డ్ కోటాలో ఉద్యోగమిస్తామంటే కొడుకును చేరమంది.

ఇంటి యజమాని లేడన్న దిగులు తప్ప ఆమె కింకే లోటూ లేదు. నెలనెలా నవీన్ పట్టుకొచ్చే జీతంలో కొంత కూతుళ్ళ పెళ్ళిళ్ళ కోసం ఆర్.డి. కట్టసాగింది. ఇలా ఒక సంవత్సరం ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోయింది.

తర్వాత మంచి సంబంధం రావడంతో కొడుక్కి పెళ్ళి చేసింది. గుణవంతురాలైన కోడలు దొరికినందుకు ముచ్చటపడింది.

ఎప్పటిలాగే మొదటి తేదీన కొడుకు జీతం తీసుకొచ్చి చేతిలో పెడతాడనుకుంది కళ్యాణి. అలా జరగకపోయేసరికి ఆమె మనసు పరిపరివిధాల పోయింది. ఇందులో కోడలి పాత్రగాని ఉందేమో అనుకుంది. అమాయకురాలైన అర్చన ముఖం చూస్తే అలా అనిపించడంలేదు. ఒకవేళ జీతంగాని అందలేదేమో! వేచి చూస్తే విషయం అదే బయట పడుతుందనుకుని మౌనంగా ఉండిపోయింది.

"జీతం అందుకోకుండా ఈ సామాన్లన్నీ ఎలా పట్టుకొచ్చావురా" అడిగింది కళ్యాణి - ఇంటికి కావలసిన వెచ్చాలు పట్టుకొచ్చిన కొడుకుతో.

"జీతం అందుకపోవడమేంటి? మొన్ననే తీసుకున్నాను. ఇంకా నిన్ను శ్రమ పెట్టడమెందుకని ఈ నెల నుండి అన్నీ నేనే చూసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు నవీన్ - లిస్టు ప్రకారం సరుకులన్నీ వచ్చాయో లేదో లెక్కచూస్తూ.

ఆ మాటకు ఖంగుతింది కళ్యాణి. ఏమనాలో తోచలేదు.

అన్నీ కొడుకే చూసుకుంటే తనకు అంతకన్నా కావలసిందేముంది? కాకపోతే ఆడపిల్లల పెళ్ళిళ్లకోసం కడుతున్న ఆర్. డి. కొనసాగిస్తే అంతే చాలు అనుకుంది. సంసారం ఎవరు నడిపితే ఏం?

"నీ దగ్గరున్న పాస్‌బుక్ ఇలా ఇవ్వమ్మా. ఇక నుంచీ నెలనెలా ఆర్.డి. మొత్తాన్ని

నేనే జమ చేస్తాను" అన్నాడు నవీన్ - అమె ఆలోచనలకు అడ్డంపడుతున్నట్లుగా.

అన్ని బాధ్యతలూ తన నెత్తిన వేసుకుంటున్నందుకు మనసులోనే కొడుకును అభినందిస్తూ పాస్‌బుక్ ఇచ్చింది కళ్యాణి.

ఇంటి ఖర్చుల కోసం నవీన్ జీతానికి తోడుగా తన పెన్షను కూడా ఇచ్చేస్తోంది.

ఇంతవరకు గీతా, కవితలు తమకేం కావాలన్నా తల్లినడిగేవారు. ఇప్పుడు అన్నయ్య ముందు చెయ్యి చాపాలంటే వాళ్ళకి మనసొప్పడం లేదు. పైగా ప్రతి దానికి వదినను అడగమంటాడు నవీన్. అలా అడగడానికి వాళ్ళకి గిల్టీగా ఉంది. అందుకే అత్యవసరమైతే తప్ప నోరు విప్పడం లేదు.

రోజులు గడుస్తున్న కొద్దీ పొదుపు పేరుతో ఇంట్లో ఖర్చులకు కోత పెడుతున్నాడు నవీన్. తల్లి ఏదో అనబోతే "నీకు తెలియందేముందమ్మా . . . మొన్నటి వరకు మనం నలుగురం ఇప్పుడు అయిదుగురమయ్యాం. రేపో నేడో నీకు మనవడు పుడితే ఆరుగురమవుతాం. కుటుంబం పెరుగుతోంది. పైగా చెల్లెళ్ళకు పెళ్ళి చెయ్యాలి. ఖర్చు అదుపులో ఉంచుకోకపోతే ఎలా?" అన్నాడు.

వాడు చెప్పిందాంట్లోనూ అర్థముంది. కుటుంబ భారమంతా తనే మోస్తున్నప్పుడు సహకరించడం తన ధర్మం అనుకుంది కళ్యాణి.

ఒకసారి ఇంటికి అతిథులెవరో వస్తే వంట ఇంట్లో కెళ్ళి కాఫీ కలపబోయింది.

"నేనుండాగా మీకెందుకత్తయ్యా శ్రమ" అంటూ వారించింది అర్చన.

కోడలీమధ్య ఎవర్నీ వంట దగ్గరకు రానీయడం లేదు. అన్ని పనులూ తనే చేసుకుంటోంది. తినడం, పడుకోవడం తప్ప కళ్యాణికి మరో పని లేదిప్పుడు. ఇంటి బాధ్యతంతా కోడలే తీసుకోవడంతో మొదట్లో ఎంతగానో సంతోషించింది. అయితే అది తమపై ఉన్న ప్రేమతో కాదనీ. . . తామెక్కడ దుబారా చేస్తామోనన్న భయంతోననీ తెలుసుకోడానికి చాలాకాలం పట్టింది.

రానురాను తమ అవసరాలకు పూర్తిగా గండి పడటంతో గీతా, కవితలకు చిర్రెత్తింది. అడపాతడపా వదినతో గొడవపడటం పరిపాటైంది.

ఆరోజు. . . ఆరేసిన చీర కనబడకపోవడంతో కోడలు మడతపెట్టి ఉంచిందేమోనని ఆమె బీరువా తెరిచింది కళ్యాణి.

ఎదురుగా పాస్‌బుక్ కనిపించడంతో తీసి చూసింది పదిహేను నెలలుగా డబ్బు

జమ కాకపోవడం ఆమెను దిగ్భ్రమకు గురిచేసింది. ఇన్నాళ్ళూ కొడుకు డబ్బు కడుతున్నాడనే అనుకుంది తప్ప, పుస్తకం పెట్లో పెట్టుకుని పూజిస్తున్నాడనుకోలేదు.

సాయంత్రం కొడుకు వచ్చాక అడిగింది.

"పెరుగుతున్న ఖర్చుల వల్ల డబ్బు కట్టలేక పోయానమ్మా. అడ్వాన్సు తీసుకుని సొమ్మంతా ఒకేసారి వేసేస్తాన్లే" అన్నాడు నవీన్.

ఆ మాటలు నమ్మాలో మానాలో తెలీలేదామెకు అయితే కొడుకు ప్రవర్తనలో మార్పు వచ్చిందని మాత్రం గ్రహించింది.

చూస్తుండగానే మరో ఆరు మాసాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

పాస్‌బుక్‌లో మాత్రం పైసా జమ కాలేదు.

అయినా కొడకుతో గొడవపడటం ఇష్టంలేక మౌనంగానే ఉండిపోయింది. మరికొంత కాలం గడిచింది. పరిస్థితిలో ఏమీ మార్పులేదు. ఆ సాయంత్రం కొడుకు పక్కన కూర్చొని "ఎదుగుతున్న చెల్లెళ్ళకు నువ్వెలానూ పెళ్ళిళ్ళు చెయ్యలేవు. నేనో మార్గం చెబుతాను వింటావా?" అని అడిగింది కళ్యాణి.

తల్లివంక సాలోచనగా చూశాడు నవీన్.

"ఇకనుంచీ నా పెన్షను అడక్కు ఆ డబ్బు నేనే పోస్టాఫీసులో జమ చేస్తాను. నీ జీతంతో సంసారాన్ని నడుపు. నేను కానీ చెల్లెళ్ళు కానీ నిన్నేమీ అడగం. నువ్వేం పెడితే అదే తింటాం" అంది.

తల్లి అంతమాట అంటుందనుకోలేదు నవీన్.

"అదేంటమ్మా అలా అంటావ్. నా జీతానికి నీ పెన్షను తోడైతేనే రోజులు గడవడం కష్టమౌతోంది. పెన్షన్ డబ్బు ఇవ్వకపోతే చెల్లెళ్ళ షోకులకీ వాళ్ళ కాలేజీ ఫీజులకీ డబ్బు ఎక్కడ నుండి పట్టుకొచ్చేది" అన్నాడు అసహనంగా.

ఆ మాటతో కొడుకు అంతరంగం పూర్తిగా తేటతెల్లమైపోయింది. తను ఇప్పటికీ మేలుకోకపోతే తన గతి అధోగతే అవుతుంది. చేతిలో చిల్లిగవ్వలేక కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయలేక జీవితాంతం వాళ్ళని కన్నెలుగానే చూడవలసి వస్తుంది. కొడుకుతో వాదోపవాదాలకు దిగే సమయం కాదిది. తనను నమ్ముకున్న ఆడపిల్లలకు న్యాయం చెయ్యాలి. అదే తనముందున్న కర్తవ్యం.

కొడుకు ఎంత వత్తిడిచేసిన వినకుండా మరునాడే గీతా, కవితలను తీసుకుని గడపదాటింది కళ్యాణి.

తన పెన్షను ఆర్.డి.లో జమచేస్తూ ఇల్లు గడవడం కోసం రెండుమూడిళ్ళలో వంటమనిషిగా చేరింది. అప్పుడప్పుడూ అదనపు ఆదాయం కోసం పెళ్ళిళ్ళకు కూడా వెళ్ళి వంట చేస్తోంది.

★ ★ ★

లోకంలో కొడుకులంతా నవీన్‌లాగే ఉండరు. తల్లినీ తోబుట్టువుల్నీ పువ్వుల్లో పెట్టుకుని చూసుకునే వాళ్ళూ ఉన్నారు. తల్లులు చేసుకున్న అదృష్టంమీదే బిడ్డల ప్రవర్తన ఉంటుందంటారు తనుఅదృష్టవంతురాలో, దురదృష్టవంతురాలో తేలాలంటే కొంత కాలం పడుతుంది. అప్పటిదాకా తన కర్తవ్యం తను నిర్వహించాల్సిందే. గాలిలో దీపం పెట్టి దేవుడా రక్షించమంటే ఎలా. . . ? మానవ ప్రయత్నంగా చేతులు అడ్డమైనా పెట్టాలి కదా. చూస్తూ చూస్తూ కూతురి భవిష్యత్తును కాలానికి వదిలెయ్యలేదు. తన జీవితం కళ్యాణి బతుకులా మారకముందే మేలుకోవాలి. అందుకు తను ఉద్యోగం చెయ్యడం ఒక్కటే మార్గం. అది ఎన్నాళ్ళన్నది ప్రశ్న కాదు ఆలోగానే కూతురికోదారి చూపాలి. ఈ విషయంలో ఎవరి వత్తిళ్ళకూ లొంగకూడదు.

దృఢ నిశ్చయంతో పైకి లేచింది ఆదిలక్ష్మి.

**(2-4-2006 ఈనాడు ఆదివారం అనుబంధం)**